నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, గురువారం 2 జనవరి 2025 | MEDAK


సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, పక్కన ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, కొనింటి మాణిక్‌రావు

కాంగ్రెస్ పాలనలో పెరిగిన నేరాలు

- గంజాయి సాగుకు సంగారెడ్డి జిల్లా అడ్డాగా మారింది
- శాంతిభద్రతలు పరిరక్షించడంలో రేవంత్ సర్కార్ విఫలం
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

సంగారెడ్డి జనవరి 1(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఏడాది పాలనలో సంగారెడ్డి జిల్లాలో శాంతిభద్రతలు లోపించి నేరాలు పెరిగాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించడంలో రేవంత్‌సర్కార్ పూర్తిగా విఫలమైందన్నారు. బుధవారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వంలో సంగారెడ్డి జిల్లాలో శాంతిభద్రతలను అదుపుచేయడంతో పాటు గంజాయి సాగు, రవాణాపై ఉక్కుపాదం మోపినట్లు చెప్పారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి పాలనలో సంగారెడ్డి జిల్లా గంజాయి సాగు, రవాణాకు అడ్డాగా మారిందన్నారు. మహిళలపై లైంగికదాడులు, దోపిడీలు, దొంగతనాలు, సైబర్ నేరాలు గణనీయంగా పెరిగాయన్నారు. జిల్లాలో నేరాల సంఖ్య ఏడాదిలోనే ఎందుకు పెరుగుతున్నదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల మీద ఒత్తిడి తీసుకువచ్చి బీఆర్ఎస్ నాయకులు, సోషల్ మీడియా యాక్టివిస్టుల మీద అక్రమంగా కేసులు పెడుతుండటం వల్ల సంఖ్య పెరుగుతున్నట్లు చెప్పారు. జిల్లాలో నిఘా విభాగం, స్పెషల్ బ్రాంచి పోలీసులు పనిచేయడంలేదా అని ప్రశ్నించారు. నేరాల అదుపునకు ముందస్తు చర్యలు తీసుకోవడంలో పోలీసుశాఖ ఎందుకు విఫలమవుతుందన్నారు. 2023లో సంగారెడ్డి జిల్లాలో 6429 కేసులు నమోదైతే కాంగ్రెస్ ఏడాది పాలనలో 7563 కేసులు నమోదైనట్లు చెప్పారు. జిల్లాలో మహిళలపై లైంగికదాడులు 31శాతం పెరిగినట్లు తెలిపారు. 2023లో లైంగికదాడుల కేసులు 100 నమోదైతే 2024లో 131 కేసులు నమోదైనట్లు చెప్పారు. 2023లో దొంగతనం కేసులు 420 నమోదు కాగా ఈ ఏడాది 639 కేసులు నమోదైనట్లు తెలిపారు. జిల్లాలో దోపిడీలు 112 శాతం పెరిగాయని, 2023లో 15 దోపిడీ కేసులు నమోదయ్యాయని, ఈ ఏడాది 36 కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ లెక్కలన్నీ సొంతంగా చెప్పడం లేదని సంగారెడ్డి జిల్లా ఎస్పీ విడుదల చేసిన వార్షిక నివేదిక ఆధారంగా చెబుతున్నట్లు చెప్పారు. 2023లో గంజాయికి సంబంధించి 11 కేసులు ఉండగా 2024లో 34 కేసులు నమోదైనట్లు చెప్పారు. సంగారెడ్డి జిల్లాలో సైబర్ క్రైమ్ కేసులు 400 శాతం పెరిగినట్లు తెలిపారు. 2023లో 323 సైబర్ క్రైమ్ కేసులు ఉంటే 2024లో 796 కేసులు నమోదైనట్లు చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో సైబర్ క్రైమ్ కేసులను అరికట్టేందుకు ప్రత్యేకంగా సైబర్ కంట్రోల్ వింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైబర్ నేరాలను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో శాంతిభద్రతలు దెబ్బతిని ప్రజల ధన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో భరోసా ఉండేదన్నారు. షీటమ్స్ ద్వారా కేసీఆర్ ప్రభుత్వం మహిళలకు సంపూర్ణ రక్షణ కల్పించిందన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం, పోలీసుశాఖ ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. విలేకరుల సమావేశంలోఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, జడ్పీమాజీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ నేతలు కాసాల బుచ్చిరెడ్డి, జైపాల్‌రెడ్డి, పట్నం మాణిక్యం, మందుల వరలక్ష్మి, మఠం భిక్షపతి, శివరాజ్‌పాటిల్, తదితర నాయకులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లతో అవస్థలు

సిద్దిపేట జిల్లా సింగాటం, అనంతరావుపల్లి గ్రామాల మధ్య దెబ్బతిన్న బీటీ రోడ్డు

గజ్వేల్, జనవరి 1: గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బీటీ రోడ్డు దెబ్బతినడంతో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండల పరిధిలోని సింగాటం, అనంతరావుపల్లి గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డు బయ్యారం చౌరస్తా నుంచి సింగాటం వరకు పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో రాత్రి సమయంలో వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు మూడు కిలోమీటర్ల మేరకు రోడ్డు తారుపైకి లేవడంతో పాటు గుంతలు ఏర్పడ్డాయి. మూలమలుపుల వద్ద పైకిలేచిన తారురోడ్డుపై ద్విచక్రవాహనాలు అదుపుతప్పి పడిపోయిన ఘటనలూ ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగాటం, అనంతరావుపల్లి గ్రామాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని రోడ్డు వేయగా ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిన్నది. ఆయా గ్రామాల నుంచి రోజూ రైతులు, యువకులు, విద్యార్థులు ఇదే మార్గంలో గజ్వేల్, సిద్దిపేట, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్తుంటారు. అధికారులు స్పందించి తారువేసేలా చొరవ తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో అయ్యప్ప స్వామికి పూజలు చేస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

అందరిపై సిద్ధి వినాయకుడి ఆశీస్సులుండాలి

రేజింతల్ సిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు

- గులాబీ అధినేత కేసీఆర్ ఆశీస్సులతో ఆలయం అభివృద్ధి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- ఘనంగా స్వాగతం పలికిన ఆలయ పూజారులు, కమిటీ సభ్యులు
- సిద్ధి వినాయక స్వామి జయంతోత్సవాలకు హాజరైన మాజీ మంత్రి

జహీరాబాద్, జనవరి 1: రేజింతల్ సిద్ధి వినాయకుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. బుధవారం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ సిద్ధి వినాయకస్వామి 225వ జయంతోత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పూర్ణకుంభంతో పూజారులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో పుష్పార్చన, హారతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని యాగశాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ సిద్ధి వినాయక స్వామివారి 225వ జయంతోత్సవాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. స్వయంభువుడిగా వెలిసిన సిద్ధివినాయక స్వామి దర్శనానికి వచ్చే భక్తులు కోరిన కోర్కెలు నెరవేర్చుతున్నారన్నారు. ఇలాంటి విశిష్టత ఉన్న సిద్ధి వినాయకుడిని మరెక్కడా మనం చూసి ఉండమన్నారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన భక్తులు ఇలవేల్పుగా మారిన స్వామివారిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున తరలివస్తుంటారన్నారు. గులాబీ అధినేత కేసీఆర్ ఆశీస్సులతో సిద్ధివినాయక ఆలయ అభివృద్ధికి కృషి చేయడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం ఆలయంలో జరిగే స్వామివారి జయంతోత్సవాలకు హాజరవుతుంటానని, ఈసారి కూడా హాజరై పుష్పార్చనలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

స్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు

రేజింతల్ సిద్ధి వినాయక స్వామి జయంతోత్సవాలకు హాజరయ్యేందుకు వచ్చిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు జహీరాబాద్ పట్టణ సమీపంలోని రంజోల్ బైపాస్‌లో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయనతో సెల్ఫీలు దిగేందుకు నాయకులు, కార్యకర్తలు, భక్తులు పోటీపడ్డారు. వారిని ఆప్యాయంగా పలకరిస్తూ సెల్ఫీలు దిగారు. అనంతరం జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీజైపాల్‌రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, జహీరాబాద్, ఝరాసంగం, కోహీర్, మొగుడంపల్లి మండలాలకు చెందిన బీఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం, నర్సింహులు, సంజీవ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అల్లాడి నర్సింహులు, నాయకులు నామ రవికిరణ్, గుండప్ప, విజయ్‌కుమార్, స్వప్నాభాస్కర్, నర్సింహారెడ్డి, ప్రవీణ్‌కుమార్, హీరూరాథోడ్, మల్లారెడ్డి, రాజేందర్‌రెడ్డి, రవికుమార్, మల్లారెడ్డి, నిరంజన్ రెడ్డి, మహిపాల్, చంద్రన్న, వీరారెడ్డి, భూంరెడ్డి, తుక్కారెడ్డి, మాణిక్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, అశోక్‌పాటిల్, చంద్రశేఖర్ రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మార్మోగిన సదాశివపేట

- చింతా గోపాల్ ఆధ్వర్యంలో మహా పడిపూజ
- హాజరైన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు
- భక్తులు, మాలదారులకు అన్నదానం

సదాశివపేట, జనవరి1: సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని అయ్యప్ప మందిరంలో బుధవారం మున్సిపల్ వైస్‌చైర్మన్, గురుస్వామి చింతా గోపాల్ 29వ ఇరుముడి మహా పడిపూజ జరిగింది. మహా పడి పూజకు మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హాజరుకాగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పాల్గొని అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గురుస్వాములు హరీశ్‌రావును శాలువా, పూలమాలతో సన్మానించి ఆశీర్వదించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ చింతా గోపాల్ 29వ ఇరుముడి కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అయ్యప్ప స్వాములు, భక్తులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మహాపడి పూజలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. అయ్యప్పస్వామి చాలా మహిమగల స్వామి అని, ఆయన దీవెనలు పొందని వారు ఉండరన్నారు. చాలా నిష్టతో చేస్తున్న స్వాములకు, రాష్ట్ర ప్రజలందరికీ ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అయ్యప్ప స్వామి మహాపడి పూజకు వేలాది మంది అయ్యప్పభక్తులు, మహిళలు తరలివచ్చారు. దీంతో ఆ ప్రాంతమంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. అయ్యప్ప భక్తులు భజన పాటలు, నృత్యాలతో ఉత్సాహం నింపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, డీసీసీబీ వైస్‌చైర్మన్ పట్నం మాణిక్యం, సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, నాయకులు శివరాజ్‌పాటిల్, చింతా సాయినాథ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్ద గొల్ల ఆంజనేయులు, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి వీరేశం తదితర నాయకులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో సర్వే ఇలా..

మండలం	ప్రజాపాలనలో దరఖాస్తులు	పూర్తి చేసిన ఇండ్లు	సర్వే శాతం
మెదక్	7696	4908	63.77
హవేళీఘనపూర్	10584	9231	87.22
నిజాంపేట్	5749	5007	87.09
నార్సింగి	4281	3696	86.33
రామాయంపేట	6185	5267	85.16
శివ్వంపేట్	11721	9324	79.55
రేగోడ్	6933	5373	77.50
వెల్దుర్తి	12370	9318	75.33
చిన్నశంకరంపేట	9665	7177	74.26
కౌడిపల్లి	10247	7445	72.66
పాపన్నపేట	12994	9144	70.37
చిలిపిచెడ్	6040	4207	69.65
అల్లాదుర్గం	8218	5700	69.36
పెద్ద శంకరంపేట	9804	6779	69.15
కొల్చారం	9736	6187	63.55
టేక్మాల్	9161	8030	87.65
చేగుంట	9986	8799	88.11
తూప్రాన్	5275	4783	90.67
నర్సాపూర్	9931	9081	91.44
మనోహరాబాద్	6442	6168	95.75
తూప్రాన్ మున్సిపాలిటీ	3770	3738	99.15
నర్సాపూర్ మున్సిపాలిటీ	3266	3061	93.72
మెదక్ మున్సిపాలిటీ	8095	7184	88.75
రామాయంపేట మున్సిపాలిటీ	2951	2601	88.14

అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు దక్కేనా?

- మెదక్ జిల్లాలో 1.91 లక్షల దరఖాస్తులు
- ఇప్పటి వరకు 79 శాతం సర్వే పూర్తి
- 35 ప్రశ్నలు.. 25 నిమిషాలు...
- పైరవీల్లో రాజకీయ నాయకులు

మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్నఘనపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ (ఫైల్)

మెదక్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తోంది. అంతేకాదు కమిటీలు వేసి అర్హులను గుర్తించేందుకు సర్వేను ప్రారంభించింది. కానీ అసలైన లబ్ధిదారులు ఎక్కడ ఉన్నారో కానీ సొంతిళ్లు ఉన్న వారు, రాజకీయ పార్టీల నాయకులు ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న విషయం సర్వేలో వెలుగు చూడడం విశేషం. ఒక వైపు ఇందిరమ్మ ఇండ్ల సర్వే జరుగుతుండగానే మరో వైపు రాజకీయ నాయకులు ఇండ్ల కోసం పైరవీలు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే మెదక్ జిల్లాలో చివరి దశకు చేరుకోవడంతో రాజకీయ, ధన బలం ఉన్న వారు ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం మంజూరు చేసే రూ.5 లక్షల కోసం కక్కుర్తి పడుతున్నారు. సర్వేకు మరో వారం రోజుల సమయం మాత్రమే ఉంది. కానీ జిల్లా వ్యాప్తంగా సర్వే చేస్తున్న సిబ్బంది యాప్‌లో పొందుపర్చే అంశాలకు ఇబ్బందులు పడుతున్నారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు79 శాతం సర్వే చేశారు. మరో 20 శాతం పూర్తి చేసేందుకు ఈ నెల 12 వరకు చివరి గడువు. సర్వేకు వెళ్లిన అధికారులకు ఇండ్ల దగ్గరకు వెళ్లగా ఆ సమయంలో ఇండ్ల వద్ద లబ్ధిదారులు లేకపోవడం, మరో పక్క ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడంతో ఇండ్లకు తాళాలు వేసి ఉండడంతో వివరాల సేకరణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దరఖాస్తు ఫారంలో ఇంటి కోసం టిక్ చేసిన వారి వివరాలు యాప్‌లో చూపకపోవడం, టిక్ కొట్టని వారివి చూపకపోవడంతో సర్వే చేస్తున్న సిబ్బంది తల పట్టుకుంటున్నారు.

మెదక్ జిల్లాలో 1,91,100 ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తీసుకువచ్చింది. దీంతో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించగా మెదక్ జిల్లాలో ఇండ్లు లేని లబ్ధిదారుల నుంచి 1.91 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అర్హులైన లబ్ధిదారులను గుర్తించడానికి సర్వే చేపట్టగా ఇప్పటి వరకు 79 శాతం పూర్తయ్యింది. వంద శాతం సర్వే పూర్తి చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ క్షేత్ర స్థాయిలో జరుగుతున్న సర్వేను పరిశీలిస్తున్నారు. సర్వే పూర్తి కాగానే వెంటనే యాప్‌లో నమోదు చేయాలని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో అధికారులు గ్రామాలకు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు.

35 ప్రశ్నలు... 25 నిమిషాలు...

మెదక్ జిల్లాలో కొనసాగుతున్న సర్వే సిబ్బంది ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా లబ్ధిదారుల వివరాలను నమోదు చేసుకోవాలి. అయితే ఒక్కో ఇంటి వద్ద 15 నుంచి 25 నిమిషాల సమయం పడుతోంది. లబ్ధిదారుడి పేరు, ఆధార్ ఐడీ, సంవత్సర ఆదాయం, సొంత స్థలం ఉందా.. గతంలో ఇల్లు మంజూరైందా.. ఇలా 35 ప్రశ్నలను సిబ్బంది రాబట్టి యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. యాప్‌లో ఏఐ టెక్నాలజీ ఉపయోగించి లబ్ధిదారుడి ముఖాన్ని, ఇల్లు నిర్మించుకునే భౌగోళిక అక్షాంశాలు, రేఖాంశాల వివరాలు నమోదు చేయడం, ఇండ్ల నిర్మాణ ప్రగతిని సైతం ఏఐ ఆధారంగా ఫొటోలు తీయడంతో ఎన్నో ఆటంకాలు ఏర్పడ్డాయి. మెదక్ జిల్లాలోని మెదక్, హవేళీఘనపూర్, కొల్చారం, టేక్మాల్, అల్లాదుర్గం తదితర మండలాల నుంచి ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కూడా ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే కలెక్టర్ వలస వెళ్లిన వారి వివరాలను సైతం యాప్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించడంతో ఏంచేయాలో తెలియక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

సంక్రాంతిలోగా వందశాతం పూర్తి చేస్తాం

మెదక్ జిల్లా వ్యాప్తంగా 79 శాతం ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తయింది. సంక్రాంతిలోగా మరో 20 శాతం సర్వే పూర్తి చేస్తాం. సర్వేకు వెళ్లిన అధికారులు, సిబ్బంది ఎక్కడ కూడా నిర్లక్ష్యం చేయరాదు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలను సైతం యాప్‌లో నమోదు చేయాలి.

–మాణిక్యం, గృహ నిర్మాణ శాఖ పీడీ, మెదక్ జిల్లా

జూనియర్ వైద్యుడిపై దాడి

సిద్దిపేట ప్రభుత్వ దవాఖానలో విధులు బహిష్కరించి నిరసన తెలిపిన డాక్టర్లు

వైద్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

సిద్దిపేట, జనవరి 1: విధుల్లో ఉన్న జూనియర్ వైద్యుడిపై ఓ వ్యక్తి దాడి చేసిన ఘటన సిద్దిపేట ప్రభుత్వ దవాఖానలో చోటు చేసుకుంది. జూనియర్ వైద్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. ప్రభుత్వ జనరల్ దవాఖానలోని ఎమర్జెన్సీ విభాగంలో జూనియర్ వైద్యుడిగా హరీశ్ విధుల్లో ఉన్నాడు. ఆదివారం రాత్రి ఓ వ్యక్తి అనారోగ్యంతో చికిత్స నిమిత్తం దవాఖానలో చేరాడు. పరీక్షించిన వైద్యులు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం వార్డుకు షిఫ్ట్ చేశారు. ఈ క్రమంలోనే పట్టణానికి చెందిన శ్రవణ్ అనే యువకుడు మంగళవారం రాత్రి సదరు వైద్యుడితో వాగ్వాదానికి దిగి దాడిచేశాడు. దీంతో వైద్య సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వగా దవాఖానకు చేరుకున్న వన్‌టౌన్ పోలీసు సిబ్బంది దాడి చేసిన శ్రవణ్ అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. వైద్యుడిపై జరిగిన దాడి ఘటనను నిరసిస్తూ ప్రభుత్వ దవాఖానలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు బుధవారం ఓపీ సేవలు నిలిపివేసి నిరసన తెలిపారు. సిద్దిపేట ఏసీపీ మధు, సీఐ వాసుదేవరావు దవాఖానకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. వైద్యులకు నచ్చజెప్పడంతో నిరసన విరమింపజేశారు. బాధిత వైద్యుడి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కొమురవెల్లి మల్లన్న ఆలయ ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న రామాంజనేయులు

మల్లన్న ఆలయ ఈవోగా రామాంజనేయులు

చేర్యాల, జనవరి 1: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ఈవోగా దేవాదాయ శాఖ డీసీ కార్యాలయంలో గెజిటెడ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రామాంజనేయులును మల్లన్న ఆలయ ఈవోగా మంగళవారం దేవాదాయ శాఖ కమిషనర్ నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. నాలుగు సంవత్సరాలుగా ఈవోగా విధులు నిర్వహించిన ఆలూరి బాలాజీశర్మ ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో రామాంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ఆలయ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మల్లన్న ఆలయ ఉద్యోగులు, సిబ్బంది, ఆలయ అర్చకులు, ఒగ్గు పూజారులు ఆయనకు అభినందనలు తెలిపారు. కొమురవెల్లి మల్లన్న ఆలయంపై దేవాదాయశాఖ ఉన్నతాధికారులు చిన్నచూపు చూస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. డిప్యూటీ కమిషనర్ హోదా కలిగిన దేవాలయానికి రాష్ట్ర కార్యాలయంలో గెజిటెడ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అధికారిని పూర్తి అడిషనల్ చార్జి పేరిట ఈవోగా నియమించడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో విధులు నిర్వహించిన ఈవో బాలాజీ సైతం దేవాదాయ శాఖ హైదరాబాద్ ఏసీగా విధులు నిర్వహించారు. ఆయన్ను సైతం ఎఫ్ఏసీ ఈవోగా కొమురవెల్లి ఆలయానికి నియమించడంతో నాలుగేండ్లు విధులు నిర్వహించారు.

కోమటిచెరువు వంతెనపై జనం

కోమటిచెరువు డైనోసార్ పార్కులో ప్రజల సందడి

న్యూ ఇయర్ సందడి

సిద్దిపేట జిల్లాలోని కోమటి చెరువు వద్ద న్యూ ఇయర్ సందడి నెలకొంది. చిన్నారులు, పెద్దలు యువతులు కుటుంబసభ్యులతో కలిసి బుధవారం సాయంత్రం పెద్ద ఎత్తున చేరుకున్నారు. సబ్బిజన్ బ్రిడ్జి, బోటింగ్, డైనోసార్ పార్కును సందర్శించి ఎంజాయ్ చేశారు.

– నమస్తే తెలంగాణ, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సిద్దిపేట, జనవరి 1

విద్యుత్ కాంతులతో జిగేల్‌మంటున్న సిద్దిపేట కోమటి చెరువు కట్ట

కోమటి చెరువు కట్టపై ప్రజల సందడి